ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 6 అక్టోబరు 2025



నేడు స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఏరీనాలో నిర్వహించనున్నామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.



తీరం..జన సందోహం



సాగరతీరం ఆదివారం సందర్శకులతో కిక్కిరిసింది. ఆర్కే బీచ్ నుంచి రుషికొండ వరకు కోలాహలంగా మారింది. సెలవు రోజు కావడంతో భారీగా జనం తరలివచ్చారు. ఎక్కువమంది సముద్రంలో స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపారు. - బీచ్‌రోడ్డు, ఆంధ్రజ్యోతి

పిడుగులతో దద్దరిల్లిన నగరం

రెండుగంటల పాటు ఉరుములు, మెరుపులు

పలుచోట్ల జోరువాన

- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీరు
- మహారాణిపేట కామన్ పాయింట్‌లో 53.75 మి.మీ.ల వర్షపాతం నమోదు

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన వాతావరణ అనిశ్చితి ప్రభావంతో విశాఖ, పరిసరాలు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పిడుగుల శబ్దాలతో దద్దరిల్లాయి. నివాస ప్రాంతాల్లోనే పిడుగులు పడుతున్నాయన్న ఆందోళన జనంలో కనిపించింది. దీనికితోడు ఉరుములు, మెరుపులతో ఆకాశం ఎర్రబారింది. భారీగా పిడుగులు, మెరుపులు, ఉరుములతో వర్షాలు కురవడం ఈ వారంలో ఇది రెండోసారి. ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. దీనికితోడు సముద్రం నుంచి తేమగాలులు నగరం, పరిసరాలపైకి వీయడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. సాయంత్రానికి నగర సమీపంలో భారీగా మేఘాలు ఏర్పడడంతో ఒక్కసారిగా చీకట్లు కమ్మేశాయి. ఆ తరువాత పెద్ద శబ్దాలతో పిడుగులు, మెరుపులు, ఉరుములు సంభవించాయి. నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో సుమారు గంటపాటు వర్షం కురిసింది. ఈదురుగాలులు, పిడుగులతో ఆరుబయట ఉన్నవారంతా

... మిగతా 4వ పేజీలో

టిడ్కో... ఇటు చూస్కో!

గృహ సముదాయంలో మౌలిక వసతుల కొరత

- కొమ్మాది అమరావతినగర్‌లో రోడ్డు నిర్మాణంపై అధికారుల నిర్లక్ష్యం
- గృహ ప్రవేశాలకు లబ్ధిదారుల విముఖత



అమరావతినగర్ నుంచి టిడ్కో ఇళ్లకు వెళ్లే మట్టి రోడ్డు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)


పట్టణ ప్రాంత నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) ద్వారా నిర్మించిన గృహ సముదాయాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ రోడ్లు, డ్రైనేజీ, నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు లేక గృహప్రవేశాలకు లబ్ధిదారులు విముఖత చేపుతున్నారు. కొమ్మాది సమీపంలోని అమరావతినగర్ టిడ్కో ఇళ్ల దుస్థితి మరింత దారుణంగా మారింది.

టిడ్కో కింద కొమ్మాది సమీపంలోని అమరావతినగర్‌లో 384 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అందులో 184 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు కాగా మిగిలినవి సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు. గృహ నిర్మాణంలో భాగంగా సివిల్‌వర్క్‌తో పాటు కార్పెంటర్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు పూర్తయ్యాయి. దీంతో జీవీఎంసీ అధికారులు లాటరీ తీసి ఇళ్లను కేటాయించారు. మొత్తం 384 మందిలో 270 మందికి బ్యాంకు రుణాలు మంజూరవగా, మిగిలినవారికి సిబిల్ స్కోర్ సరిగా లేకపోవడం, 60 ఏళ్లు దాటడం వంటి సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయాయి. నగరానికి చేరువగా ఉండడంతో అమరావతినగర్ టిడ్కో గృహసముదాయంలోని ఫ్లాట్లకు డిమాండ్ ఏర్పడింది. కేటాయింపులు పూర్తవడంతో గృహప్రవేశాలు జరుగుతాయని అధికారులు భావించారు. అయితే అన్ని బ్లాక్‌లకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించినప్పటికీ మెయిన్‌రోడ్డు నుంచి టిడ్కో గృహసముదాయానికి వెళ్లే అర కిలోమీటరు మట్టిరోడ్డును పట్టించుకోకపోవడంతో దారి లేకుండా పోయింది. చిన్నపాటి వర్షంపడినా కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలులేని పరిస్థితి ఉందని లబ్ధిదారులు మొరపెట్టుకున్నారు. రోడ్డు నిర్మిస్తే గృహప్రవేశాలకు సిద్ధంగాఉన్నారని జీవీఎంసీ యూసీడీ అధికారులు చెబుతున్నారు. ఈ బాధ్యత టిడ్కో అధికారులదంటుండగా, జీవీఎంసీయే రోడ్డు వేయా లని టిడ్కో అధికారులు వాదిస్తున్నారు.

లబ్ధిదారులపై ఈఎంఐ భారం

బ్యాంకు రుణం మంజూరవడంతో వాయిదాలు చెల్లించాలంటూ ఒత్తిడి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రస్తుత ఇళ్ల అద్దెకు ఈఎంఐ తోడై కుదేలవుతున్నామని గగ్గోలుపెడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణం రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.

నేడు విశాఖ పోర్టుకు వీఎల్‌జీసీ నౌక శివాలిక్



విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యం పరిధిలోకి వచ్చిన వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్ (వీఎల్‌జీసీ) నౌక శివాలిక్ దేశంలోనే తొలిసారిగా విశాఖ పోర్టుకు సోమవారం రానుంది. ఎల్‌పీజీ రవాణా నిమిత్తం షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) గత నెల పదో తేదీన శివాలిక్ నౌకను తీసుకుంది. అబుదాబీ నుంచి విశాఖ పోర్టుకు రానుంది. ఈ నౌకకు కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ స్వాగతం పలికి, నౌకలోని సిబ్బంది, అధికారులను అభినందిస్తారు. అనంతరం శాలిగ్రాంపురంలోని సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో జరిగే బహిరంగ సభలో విశాఖపట్నం పోర్టు అథారిటీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. పోర్టు మౌలికసదుపాయాల అభివృద్ధి, నిర్వహణ సామర్థ్యాల పెంపు, పర్యావరణ హిత హరిత పోర్టు చర్యలను మారిటైమ్ ఇండియా విజన్- 2030కు అనుగుణంగా తీసుకెళ్లనున్న తీరును మంత్రి వెల్లడిస్తారు. శివాలిక్ నౌక భారత సముద్ర రవాణా రంగంలో మైలురాయిగా నిలుస్తుందని పోర్టు అధికారులు అభివర్ణిస్తున్నారు. భారత్ గ్యాస్ లాజిస్టిక్స్ సామర్థ్యాలను బలోపేతం చేయడమే కాకుండా ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్య సాధనలో కీలక అడుగుగా అభివర్ణిస్తున్నారు.

రేషన్ డిపోల్లో బియ్యం నిల్

- ఆన్‌లైన్ సమస్యతో చేరని సరకు
- రెండువేల టన్నుల కోసం ఎదురుచూపులు



విశాఖపట్నం/గాజువాక/మర్రిపాలెం/మహారాణిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): **ఈనెల ఒకటో తేదీ నుంచి బియ్యం కార్డుదారులకు అందించాల్సిన బియ్యం సరఫరాలో పౌర సరఫరాల సంస్థ విఫలమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో సరఫరా చేయకపోవడంతో నగరంలో కొన్ని రేషన్ డిపోల్లో స్టాకు లేదు. దీంతో కార్డుదారులు బియ్యం కోసం తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అక్టోబరు నెల ఇండెంట్ మేరకు జిల్లాకు ఇంకా రెండువేల టన్నుల బియ్యం రేషన్ డిపోలకు చేరాల్సి ఉంది.**

జిల్లాలో ఎక్కువ డిపోలకు బియ్యం అందించే మర్రిపాలెం- 1 గోదాములో బియ్యం నిల్వలు లేవు. మిగిలిన గోదాముల్లో కూడా సరకు ఖాళీ అవడంతో అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. మొత్తం 641 రేషన్ డిపోల ద్వారా 5.24 లక్షల బియ్యంకార్డుదారులకు నెలకు సుమారు ఎనిమిదివేల టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. సాధారణంగా ప్రతినెలా ఒకటోతేదీ నుంచి సరకుల పంపిణీ కోసం ముందుగానే డిపోలకు బియ్యం సరఫరా ప్రారంభిస్తారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని బఫర్ గోదాముల నుంచి బియ్యం సరఫరా జరుగుతుంది. ఇందుకోసం కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ మొరాయించడంతో సమస్య ఎదురయింది. రెండు నెలలుగా ఇదే సమస్య ఎదురవుతున్నా పరిష్కరించలేక అధికారులు చేతులెత్తేశారు. దీంతో కార్డుదారులకు బియ్యం పూర్తిగా పంపిణీ చేసే పరిస్థితి కనిపించడం లేదు. డిపోలకు అవసరమైన స్టాకులో 30 నుంచి 40 శాతం ఇచ్చిన అధికారులు మిగిలిన స్టాకు తరువాత ఇస్తామన్నారు. ఉన్న బియ్యం పంపిణీ చేసిన డీలర్లు నిల్వలు లేక డిపోలు మూసేయాల్సి వస్తోంది. ఈ పరిణామంతో ... మిగతా 4వ పేజీలో

భాషా పండిట్లకు పదోన్నతులు

క్లస్టర్ల పరిధిలోనే విధులు

- ప్రస్తుత పాఠశాలలోనే కొనసాగే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 78 మందికి ఉత్తర్వులు



విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): **ఆరేళ్ల నిరీక్షణ అనంతరం తెలుగు/హిందీ భాషా పండిట్లకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కొనసాగుతున్న భాషా పండితులకు కల్పించిన స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులు ఈ నెల మూడోతేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 75 మంది తెలుగు, ముగ్గురు హిందీ భాషా పండితులకు ప్రయోజనం చేకూరింది.**

ఉమ్మడి ఏపీలో నిర్వహించిన డీఎస్సీల ద్వారా నియమితులైన భాషా పండితుల్లో కొంతమందికి గతంలోనే గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 పదోన్నతులు కల్పించారు. చివరిగా 2019లో కొంతమందికి పదోన్నతులు ఇచ్చి, మిగిలిన వారిని డీఈవో పూల్‌లో ఉంచేశారు. దీనిపై భాషా పండితులు గత ప్రభుత్వంతో పోరాడినా ఫలితం దక్కలేదు. డీఈవో పూల్‌లో ఉన్న కారణంగా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ జరిగిన ప్రతిసారీ వీరికి బదిలీలు తప్పనిసరయ్యేవి. దీంతో ఎక్కడా రెండేళ్లకు మించి పనిచేయలేకపోయారు. సాధారణంగా ఒకచోట బదిలీ అయితే ఎనిమిదేళ్ల వరకు అక్కడే పనిచేసుకునే వెసులుబాటు ఎస్జీటీ/స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు ఉంది. కానీ డీఈవో పూల్‌లోని భాషాపండిట్లకు ఈ అవకాశం కల్పించలేదు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తదితరులు ఈ సమస్యను మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ మేరకు డీఈవో పూల్‌లో ఉన్న ఉమ్మడి జిల్లా పరిధిలోని 75 మంది తెలుగు, ముగ్గురు హిందీ పండితులకు అడహక్ బేసిక్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తూ విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. దీనివల్ల ఇప్పటికే క్లస్టర్ స్కూళ్ల పరిధిలో పనిచేస్తున్న పండితులు అక్కడే పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు క్లస్టర్ స్కూళ్ల పరిధిలో (ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల వరకు) ఎక్కడైనా టీచర్లు సెలవు పెడితే అక్కడికి వెళ్లి బోధించాల్సి వచ్చేది. తాజా పదోన్నతుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న చోటే పనిచేయాలి. అంతేకాదు వచ్చే ఏడాది నిర్వహించే బదిలీ కౌన్సెలింగ్‌లో మిగిలిన టీచర్లతోపాటు వీరికీ అవకాశం కల్పిస్తారు. కాగా ఆరేళ్ల నుంచి పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న తమకు న్యాయం చేసిన ప్రభుత్వానికి, సహకరించిన మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్సీలు, ఇతర నేతలకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వై.దయానంద్ ధన్యవాదాలు తెలిపారు.

అంతర్ జిల్లా బదిలీ టీచర్లకు పోస్టింగ్స్

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ... మిగతా 4వ పేజీలో

తాగే నీరు స్వచ్ఛమేనా?

ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలకు భారీగా నీటి నమూనాలు

- వ్యాధులు ప్రబలిన ప్రాంతాల నుంచి మరిన్ని శాంపిల్స్



పెదవాల్తేరులోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. అనేకచోట్ల మురుగు కాల్వలు పొంగి పొర్లుతున్నాయి. తాగునీటిని సరఫరా చేసే కొళాయి పైపుల లీకేజీలతో తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో తాము తాగే నీటిని పరీక్షించుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. జీవీఎంసీ సరఫరా చేసే నీటితోపాటు వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్స్‌లో కొనుగోలు చేసే నీటిని కూడా అనుమానాలతో పరీక్షలకు తెస్తున్నారు. దీంతో పెదవాల్తేరులోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలకు భారీగా నీటి నమూనాలు చేరుతున్నారు. సాధారణంగా రోజుకు పది నుంచి 20 నమూనాలు రాగా, కొద్దిరోజులుగా 50 నుంచి 60 వస్తున్నాయని చెబుతున్నారు.

ఎక్కడి నుంచి..

ఇక్కడికి జీవీఎంసీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతోపాటు సాధారణ ప్రజలు నమూనాలు తెస్తున్నారు. సాధారణంగా ఆయాశాఖల అధికారులు ప్రతివారం కొన్ని నమూనాలు పంపిస్తుంటారు. అయితే నీటి రుచిలో తేడా ఉందని, ఇంట్లో జ్వరాలు ఎక్కువయ్యాయని, చాలా మంది నమూనాలు తీసుకువచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. వీటిలో ఎక్కువగా కొళాయి నీరు ఉండగా, ఆర్వో ప్లాంట్స్‌లో కొనుగోలు చేసిన నమూనాలు కూడా ఉన్నాయన్నారు.

ఈ పరీక్షలు నిర్వహణ..

కలుషిత నీటిని తాగడం వల్ల ... మిగతా 4వ పేజీలో

కోడి వ్యర్థాల వివాదంపై సీపీ సీరియస్

- కాంట్రాక్టర్లను బెదిరించిన వారిపై కఠిన చర్యలకు ఆదేశం



విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివాదాలకు చిరునామాగా మారిన కోడివ్యర్థాల సేకరణ పంచాయితీపై సీపీ శంఖబ్రతబాగ్చి సీరియస్ అయినట్టు తెలిసింది. కోడివ్యర్థాల సేకరణ కాంట్రాక్టు దక్కించుకున్న వారిని బెదిరించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గోపాలపట్నం పోలీసులను ఆదేశించినట్టు సమాచారం. జీవీఎంసీ పరిధిలోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించే బాధ్యత ను జోన్లవారీగా కాంట్రాక్టర్లకు జీవీఎంసీ అప్పగించింది. వారు వ్యర్థాలను చేపలచెరువులకు విక్రయిస్తున్నారు. దీని వల్ల భారీగా ఆదాయం సమకూరుతుండడంతో గతంలో కోడివ్యర్థాల సేకరణలో అనుభవం ఉన్న ఓ వైసీపీ చోటా నేత కన్నేశారు. తనకు కోడివ్యర్థాల సేకరణలో వాటా ఇవ్వాలని బెదిరించడంతోపాటు వాహనాలను అడ్డుకుని అధికారులకు అప్పగిస్తున్నట్టు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. దీనిపై నగరానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి ద్వారా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీంతో పోలీసులు వైసీపీ చోటానేతకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'లో 'చికెన్ వ్యర్థాల సేకరణ వివాదంపై టాస్క్‌ఫోర్స్ పంచాయితీ' శీర్షికన శనివారం కథనం ప్రచురించింది. దీనిపై సీపీ శంఖబ్రత బాగ్చిఆరా తీసినట్టు తెలిసింది. స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాలు కూడా 'ఆంధ్రజ్యోతి' కథనంలో పేర్కొన్న అంశాలు వాస్తవమేనని నిర్ధారించడంతో లోతుగా విచారణ జరపాలని సీపీ గోపాలపట్నం పోలీసులను ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు కోడివ్యర్థాల సేకరణ బాధ్యతలు చూస్తున్న కాంట్రాక్టర్లను సోమవారం ఆధారాలతో గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు సమాచారం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీ చోటానేత బెదిరింపులు, ఇతర వ్యవహారాలు వాస్తవమేనని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని సమాచారం.

మూడు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్

- గంభీరం, వేములవలస, దాకమర్రిలకు ప్రత్యేక సిబ్బంది
- మరో 15 పంచాయతీలకు గ్రేడ్-1 హోదా
- త్వరలో అధికారిక ఉత్తర్వులు



గంభీరం పంచాయతీ కార్యాలయం

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వ్యవస్థలో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆదాయం, జనాభాను పరిగణనలోకి తీసుకుని గ్రేడ్లు ఇవ్వాలన్న ప్రతిపాదనను ఆమోదించింది. ఈ మేరకు జిల్లాలోని గంభీరం, వేములవలస, దాకమర్రి పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా కల్పిస్తారు. ఏడాదికి రూ.కోటి ఆదాయం దాటిన పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా లభించనున్నది.

జిల్లాలో మొత్తం 79 గ్రామ పంచాయతీలు ఉండగా జాతీయ రహదారి, నగరానికి ఆనుకుని ఉన్న గ్రామ పంచాయతీలకు ఆదాయం ఎక్కువగాఉంది. వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, సంతలు, భూముల క్రయవిక్రయాల (రిజిస్ట్రేషన్ ఫీజులో కొంత పంచాయతీలకు ఇవ్వాలి) ... మిగతా 4వ పేజీలో


రైతులతో సమావేశమైన సీపీఎం నాయుకులు

'తర్లువాడ రైతులకు అండగా ఉంటాం'

ఆనందపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లువాడ పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్లు 1, 71, 72, 74, 75, 35లో ఉన్న భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో గూగుల్ టెక్ కంపెనీకి అప్పగించడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఆదివారం వారు గ్రామంలో బాధిత రైతులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ భూములను ఎస్సీ రైతులకు రెండు ఎకరాల చొప్పున కేటాయించారని, నాటి నుంచి వారు జీడి, మామిడి, సపోటా, నిమ్మ తోటలను సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. అధికారులు ఇటీవల రైతుల అనుమతి లేకుండా భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. రైతుల తరఫున పోరాటం చేస్తామన్నారు. రైతుల అనుమతి లేకుండా భూములను తీసుకోవడం చట్ట విరుద్ధమని, ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములపై వారికే హక్కు ఉంటుందని, ఈ విషయాన్ని హైకోర్టు కూడా చాలా కేసుల్లో స్పష్టం చేసిందన్నారు. సమావేశంలో సీపీఎం భీమిలి జోన్ కార్యదర్శి మూర్తి, సహాయ కార్యదర్శి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయం నూతన కార్యవర్గం


ఆలయంలో నూతన కార్యవర్గం సభ్యులు

భీమునిపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో ఉన్న అయ్యప్ప దేవాలయం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ఆలయ ధర్మకర్త, దివంగత గురుస్వామి బాల సుబ్రహ్మణ్యం తనయుడు బాలకృష్ణ (పాండే) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా సుసరాపు కామేశ్వర మాధవ శాస్త్రి (మధు పంతులు), ఉపాధ్యక్షుడిగా కదిరి జగన్నాథం, ప్రధాన కార్యదర్శిగా ముసునూరి సూర్య శ్రీనివాస్, కోశాధికారిగా మొకర నరసింగరావు, సమన్వయకర్తగా గుగ్గిళ్ళ సాయి పార్వతీశం, గౌరవ సలహాదారుడిగా శైలేందర్ రెడ్డి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాధవశాస్త్రి మాట్లాడుతూ ఆలయాన్ని నిర్మించి 35 ఏళ్లు కావడంతో జీర్ణావస్థకు చేరుకుందని, కొత్త ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లా ప్రగడ సత్యప్రసాద్, ఆదిమూలం నాగరాజు, బొండా మణికంఠ, సూరిబాబు, సాయి చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావుకు సత్కారం


సూర్యప్రకాశ్‌రావు దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

మధురవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ్‌రావును ఆ సంఘం సభ్యులు ఆదివారం శివశక్తి నగర్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ సంఘం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తన తండ్రి నాగోతి సింగన్న ఆశయ సాధన దిశగా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ నాయుడు, నాయకులు ఎస్‌వీ రమణ, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, పాపారావు, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత్ మహిళల క్రికెట్ జట్టు రాక

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహిళల వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఈనెల 9న ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరగనున్న వన్డే మ్యాచ్‌లో పాల్గొనే భారత్ జట్టు సోమవారం నగరానికి చేరుకోనుంది. ఉదయం 10.30 గంటలకు చార్టెడ్ ఫ్లైట్‌లో కొలంబో నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో నొవోటల్‌కు చేరుకుంటారు. దక్షిణాఫ్రికా జట్టు మంగళవారం ఉదయం 10.15 గంటలకు చార్టెడ్ ఫ్లైట్‌లో ఇండోర్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.00 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో నేరుగా ద పార్క్ హోటల్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు.

అప్పన్న సన్నిధిలో శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రధానార్చకుడు



సింహాచలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామిని తమిళనాడులోని శ్రీరంగం శ్రీరంగనాథ స్వామి దేవాలయ ప్రధానార్చకుడు సుందర్ బట్టర్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న బట్టర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి, స్వామివారి చిత్తరువును, ప్రసాదాలను అందజేశారు.



మాంగల్యాన్ని చూపుతున్న అర్చకులు, ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అంగరంగ వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

- రికార్డు స్థాయిలో పాల్గొన్న 138 జంటలు
- శేషపాన్పు వాహనంపై గోవిందరాజస్వామి

సింహాచలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తమిళనాడుకు చెందిన కించిత్‌కారం ధర్మ సంస్థాన పీఠానికి చెందిన 125 జంటలతో పాటు స్థానికంగా మరో 13 జంటలు కలిపి మొత్తం 138 జంటలు నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులను నేత్రపర్వంగా అలంకరించి శేషపాన్పుపై ఉంచారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు, షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. దేవాలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి సత్యశ్రీనివాస్, పీఆర్ఓ అప్పలనాయుడు, ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా అంతకముందు వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సిరి సంపెంగల పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను బయటకు తీసి బేడామండపంలో ప్రదక్షిణ జరిపారు. అనంతరం స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుల సారధ్యంలో అర్చకులు నారసింహ అష్టోత్తర శతనమావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్క సిరి సంపెంగతో పూజ చేశారు. ఆర్జిత సేవగా సిరి సంపెంగల పూజ ప్రారంభించిన ఏడేళ్లలో మొదటిసారిగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన 125 మంది జంటలు పాల్గొనడం రికార్డుగా ఆలయ అధికారులు తెలిపారు.


గరుడ వాహనంపై స్వామివారు

కన్నుల పండువగా గరుడోత్సవం

అప్పన్న స్వామి గరుడోత్సవం కన్నుల పండువగా సాగింది. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు.తమిళనాడులోని కించిత్‌కారం ధర్మ సంస్థాన్‌కు చెందిన భక్తుల హరినామ సంకీర్తనలు, అప్పన్న ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద పఠనాలు, కోలాటాలు, నడుమ మాడవీధుల్లో రజిత గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, రంగనాథస్వామి దేవాలయం ప్రధానార్చకుడు సుందర్ బట్టర్, అప్పన్న ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యో గుల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ విశాఖ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆదివారం మధురవాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈపీఎఫ్‌లో సరైన డేటా ఇవ్వాలని, 10డి ఫారం తప్పు లేకుండా పూర్తి చేసి పంపాలని, ఇందుకు ఎటువంటి సహకారం కావాలన్నా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు తరచూ అనారోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, ఆర్టీసీ డిస్పెన్సరీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డిస్పెన్సరీలో కార్డియో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఏవీ రావు, రాయ్, వైఎస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా రేపు

పద్మనాభం రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం ఈనెల 7న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్టు యూటీఎఫ్ జిల్లా ప్రతినిధి ఉప్పాడ రాము తెలిపారు. ఆదివారం ఆయన పద్మనాభం,ఆనందపురం మండలాల్లోని పలు గ్రామాల్లో ఫ్యాప్టో సభ్యులతో కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి తగ్గించాలన్నారు. ముఖ్యంగా యాప్‌ల బాదుడు నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు.

నేడు టీడీపీ సమావేశం

పద్మనాభం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో సోమవారం ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ మండల సమావేశం జరగనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలన్నారు.

తీర ప్రాంతంలో భారీ వర్షం

సాగర్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, రుషికొండలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై సుమారు గంట పాటు పిడుగులతో వర్షం కురిసింది. రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లకు వచ్చిన సందర్శకులు ఇబ్బంది పడ్డారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని, గతంలో ఇచ్చిన అర్జీలు పరిష్కారం కాకపోతే వాటికి సంబంధించిన స్లిప్పులు తీసుకురావాలని సూచించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖలు ప్రారంభం


బ్యాంకు ఆఫ్ ఇండియా నూతన శాఖను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ నికేశ్ కుమార్ సిన్హా

కొమ్మాది, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు, వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంక్ లక్ష్యమని బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేశ్ కుమార్ సిన్హా అన్నారు. ఆదివారం ఆయన మారికవలస, తగరపువలసలో ఏర్పాటు చేసిన ఆ బ్యాంకు నూతన శాఖలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలను విస్తరించడం ద్వారా వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్. సీతారాం మాట్లాడుతూ తమ బ్యాంకులో డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, అన్ని రకాల సేవలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో పూర్వ విద్యార్థుల కలయిక


వేడుకల్లో పూర్వ విద్యార్థుల ఉత్సాహం

భీమునిపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో 1977-80లో డిగ్రీ చదివిన సైన్స్ విద్యార్థులు ఆదివారం భీమిలిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.పట్టణంలోని గుప్తావీధిలో ఉన్న కోట భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. 45 ఏళ్ల తరువాత స్నేహితులంతా ఒకచోట చేరి ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఏమి చేస్తున్నది ఆరా తీశారు. ఆట, పాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు అడ్వకేట్ కోట పద్మారాణి, మాణిక్యాచారి, అమెరికాలో ప్రముఖ కంపెనీలకు ముఖ్య సలహాదారు డాక్టర్ విశ్వేశ్వరరావు, గీతం కళాశాల ప్రొఫెసర్ మురళి, పారిశ్రామికవేత్త మోహనరావు, రైల్వే రిటైర్డ్ అధికారి బాలాజీ, మెరైన్ ఇంజనీరు ఎం.ఎస్. శ్రీనివాసరావు, డివి రమణ, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సీనియరు అడ్వకేట్ కోట మల్లికార్జునరావు హాజరయ్యారు.

'ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం'

తగరపువలస, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 2వ వార్డులో కార్పొరేటర్ చిన్నికుమారిలక్ష్మి ఆదివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా ఉంటుందన్నారు. అనంతరం సూపర్ సిక్స్. సూపర్ హిట్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తి అరెస్టు

భీమునిపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :బాణసంచా సామగ్రి అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, రూ. 4 వేలు విలువైన సరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది భీమిలిలో బాణసంచా నిల్వలపై పలు ప్రాంతాల్లో ఆదివారం సోదాలు నిర్వహించారు. ఈమేరకు నమ్మివానిపేటలో మునపర్తి శ్రీనివాసరావు (57) వద్ద అక్రమంగా జువ్వలు 150, బెల్ట్ బాంబులు 6, నార బాంబులు 44, షాట్స్ 4 ఉన్నట్టు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేశారు.

జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన

తగరపువలస, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ 2.0పై ప్రతిఒక్కరికి అవగాహన అవసర మని 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి అన్నారు. ఆదివారం పాతమీసేవ కేంద్రంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు 15 జాతీయ స్థాయి ర్యాంకులు

కంచరపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో శిక్షణ పొందుతున్న 15 మంది విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు లభించాయి. 2024-2025 విద్యాసంవత్సరానికి ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం న్యూఢిల్లీలో జరిగిన స్కిల్ కాన్వొకేషన్ వేదికలో ప్రధాని మోదీ నుంచి అవార్డులు స్వీకరించారు. ఈ ఏడాది జరిగిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)లో కూడా 150/150 మార్కులను 26 మంది సాధించారన్నారు. జాతీయ స్థాయిలో డి.వందన 1199/1200 (పెయింటర్ విభాగంలో ప్రథమ ర్యాంకు), ఆర్&ఏసీ ట్రేడ్‌లో పి.మధులత (1194/1200) మార్కులు, ఎస్.యామిని వరలక్ష్మి ఫుడ్ వర్క్ టెక్నీషియన్ (కార్పెంటర్) 595/600 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకులు పొందారన్నారు.

విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాలకు ఆర్‌టీసీ 60 ప్రత్యేక సర్వీసులు

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాలకు 60 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేసేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. ప్రతిరోజూ 20 సర్వీసులు చొప్పున సోమ, మంగళ, బుధవారాల్లో వీటిని నడపనున్నారు. విశాఖ నుంచి విజయనగరానికి ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు ఉంటుంది. స్టీల్ సిటీ డిపో, విశాఖపట్నం డిపో, మద్దిలపాలెం బస్‌స్టేషన్, ద్వారకా కాంప్లెక్సు, గాజువాక డిపో నుంచి వీటిని ఆపరేట్ చేయనున్నారు. ఉత్సవాలకు విశాఖ నుంచి ఎక్కువ మంది భక్తులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణ ప్రయాణికులు, ఉత్సవాలకు రాకపోకలు సాగించే వారి వల్ల షెడ్యూల్ సర్వీసుల సామర్థ్యానికి మించి ప్రయాణికుల డిమాండ్ ఉంటుందని ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేసేందుకు నిర్ణయించారు. సోమవారం ఉదయం నుంచి ఈ సర్వీసులు సిద్ధం కానున్నాయి. ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటే సర్వీసుల సంఖ్య పెంచుతామని ఆర్ఎం అప్పలనాయుడు వెల్లడించారు.

సత్వ నేచురల్స్ ఆధ్వర్యంలో కుక్ వేర్ ఎగ్జిబిషన్ కమ్ సేల్


అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

సీతంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రామాటాకీస్ రోడ్డులో గల అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 7వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు సత్వ నేచురల్స్ (సీతమ్మధార) ఆధ్వర్యంలో కుక్ వేర్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రముఖ బ్రాండ్‌లైన ఇండస్ వేలి, వండర్ చెఫ్, ప్రెస్టీజ్ ప్రొడక్ట్‌లపై 50 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాత అల్యూమినియం వంట పాత్రల మార్పిడిపై అదనపు తగ్గింపు కూడా ఉందన్నారు. ట్రై ప్లే స్టీల్, కాస్ట్ ఐరన్, ఐరన్, సిరామిక్, ఇత్తడి వంట పాత్రలు, గాజు, రాతి, చెక్క పరికరాలు, ఇతర ఆర్గానిక్ ఉత్పత్తులు ఇక్కడ విక్రయిస్తున్నారు. ప్రముఖ ఆర్గానిక్ ఉత్పత్తుల కంపెనీలు 24 మంత్ర, నేచర్ ల్యాండ్ ఆర్గానిక్ తత్వ ప్యూర్ అండ్ షూర్ ప్రో నేచర్, కపీవ, మిల్లెట్ బ్యాంక్, జీని, ఎన్ రిచ్ సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేసి 25 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నాయి. ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా చిరుధాన్యాలతో చేసిన చిరుతిండ్లు విక్రయిస్తున్నారు. అధిక డిస్కౌంట్లతో పాటు లక్కీ డ్రా ద్వారా ప్రత్యేక బహుమతులు పొందవచ్చని నిర్వాహకురాలు వనుకూరు లక్ష్మీతేజ తెలియజేశారు.

రేషన్ డిపోల్లో బియ్యం నిల్

... 3వ పేజీ తరువాయి

పలుమార్లు డిపోలకు తిరగాల్సి వస్తోందని కార్డుదారులు వాపోతున్నారు. గోదాముల నుంచి డిపోలకు సరకు సరఫరా చేసే కాంట్రాక్టర్లు ప్రతి నెలా ఒకే సారి వాహనాల్లో తరలించేవారు. తాజాగా నెలకొన్న సమస్యతో రెండుమూడు సార్లు తిప్పాల్సి వస్తోందని, దీంతో అదనపు భారం పడుతోందని గగ్గోలు పెడుతున్నారు. నగరంలోని కార్డులతోపాటు పోర్టబిలిటీ ద్వారా వేలాదిమంది బియ్యంకార్డుదారులు డిపోల నుంచి బియ్యం తీసుకుంటున్నందున అందుకు తగినట్టు ఏర్పాట్లు చేయడంలో పౌరసరఫరాల సంస్థ విఫలమైందని డీలర్లు ఆరోపిస్తున్నారు. సమస్యపై జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

పిడుగులతో దద్దరిల్లిన నగరం

... 3వ పేజీ తరువాయి

ఉలిక్కిపడ్డారు. సాయంత్రం తీరానికి చేరిన వారు తడిసి ముద్దయ్యారు.

నగరంలో పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఆరుబయట వ్యాపారాలు చేసేవారంతా ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల సరుకులు తడిసిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మురుగుకాల్వలు పొంగాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వారం రోజులగా వర్షాలు కురుస్తుండంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. నగరంలోని మహారాణిపేట కామన్‌పాయింట్‌లో 53.75, గాజువాక కేబీఆర్ రిజర్వాయర్‌లో 52.5, గవరపాలెంలో 50.5, రెవెన్యూపార్కులో 49.75, గోపాలపట్నంలో 43.0, హెచ్‌బీకాలనీలో 41.5 మి.మీ.ల వర్షపాతం నమోదయింది.

తాగే నీరు స్వచ్ఛమేనా?

... 3వ పేజీ తరువాయి

డయేరియా, అతిసార వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. దీంతో పరీక్షలు చేయించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక్కడకు వస్తున్న నమూనాల్లో పీహెచ్, టీడీఎస్ (సోడియం, పొటాషియం లెవెల్స్), కలర్, టర్బిడిటీ (మురికిగా ఉందా లేదా), క్లోరిన్ (మోతాదు), నైట్రైట్ (డ్రైనేజీ నీరు కలిసిందా లేదా), హార్డ్‌నెస్, ఆల్కలినిటీ (బేసిక్ ఎలిమెంట్స్ అయిన కాల్షియం, మెగ్నీషియం ఉన్నాయా లేదా) అన్నది పరీక్షిస్తుంటారు.కాగా ప్రస్తుతం వస్తున్న నమూనాల్లో పీహెచ్ తక్కువగా ఉన్నట్టు తేలిందని అధికారులు చెబుతున్నారు. పీహెచ్ (పవర్ ఆఫ్ హైడ్రోజన్) తక్కువగా ఉంటే గ్యాస్ట్రిక్ ఇరిటేషన్స్ వంటి ఇబ్బందులు వస్తాయని, టీడీఎస్ కూడా తక్కువగా ఉందని తేలుతోంది. దీని వల్ల శరీరానికి అవసరమైన సోడియం, పొటాషియం, కాల్షియం వంటి మినరల్స్ అందవు. దీని వల్ల శక్తిహీనంగా మారడంతో పాటు రక్త సరఫరా తగ్గుతుంది. అతి తక్కువ నమూనాల్లో మాత్రమే క్లోరిన్, నైట్రైట్ సంబంధిత సమస్యలున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

భాషా పండిట్లకు పదోన్నతులు

... 3వ పేజీ తరువాయి

ఉమ్మడి విశాఖ జిల్లాకు బదిలీపై వచ్చిన 48 మంది ఉపాధ్యాయులకు విద్యా శాఖ పోస్టింగ్స్ ఇచ్చింది. వీరిలో 16 మంది స్కూల్ అసిస్టెంట్, 32 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. ఎక్కువమందికి కేటగిరీ 3, 4 పరిధిలోని పాఠశాలల్లో పోస్టింగ్స్ దక్కాయి. దీనిపై కొందరు టీచర్లు అభ్యంతరం వ్యక్తంచేసి ఆందోళనకు దిగినా.. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏజెన్సీ, మారుమూల ప్రాంత పాఠశాలల్లో నియమించారు.

మూడు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్

... 3వ పేజీ తరువాయి

ద్వారా మంచి ఆదాయం వస్తోంది. గంభీరం పంచాయతీ పరిధిలో చిన్న పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, భూముల విక్రయాలు ఉండడంతో ఏడాదికి రూ.1.5 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. ఆనందపురం మండలం వేములవలస పంచాయతీకి సంత ఆదాయం, దుకాణాలతో పాటు రిజిస్ట్రేషన్ల వల్ల రూ.1.2 కోట్ల ఆదాయం వస్తోంది. దాకమర్రి పంచాయతీలో ఇటీవల భూముల క్రయవిక్రయాలు పెరగడంతో ఆదాయం రూ.కోటి దాటింది. దీంతో ఈ మూడు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా లభించనున్నది. ఈ హోదా లభించిన పంచాయతీలకు కార్యదర్శిగా డిప్యూటీ మండల అభివృద్ధి అధికారిని నియమించడంతో పాటు సిబ్బందిని కేటాయిస్తారు. అలాగే ఆర్థిక సంఘం నిధులు ఎక్కువగా రానున్నాయి. ఏటా రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ఆదాయం వచ్చే పంచాయతీలకు గ్రేడ్-1, రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల ఆదాయం వచ్చే పంచాయతీలకు గ్రేడ్-2 హోదా కల్పిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సుమారు 15 గ్రామ పంచాయతీలకు గ్రేడ్-1 హోదా లభించే అవకాశం ఉంది. పంచాయతీలకు గ్రేడ్ల కేటాయింపునకు సంబంధించి త్వరలో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ప్రజా దర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

» వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ సోమవారం వీఎంఆర్డీఏలో నిర్వహించే ప్రజా దర్బార్‌ను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీఎంఆర్డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొనను న్నట్టు చెప్పారు. వీఎంఆర్డీఏకు సంబంధించిన అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం ప్రజానీకం వినతులు అందజేయవచ్చన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా సహాయం అందించాలనేదే కూటమి ప్రభుత్వ ధ్యేయ మని, ఆ దిశగానే వీఎంఆర్డీఏ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసేలా శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. నేరుగా తనకు వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

గ్రీన్ బెల్ట్‌లో కలప డిపో

» ఆక్రమణపై నోరు మెదపని అధికారులు
» కొందరు అధికారుల సహకారం ఉందంటూ పలు ఆరోపణలు
» పచ్చదనం కనుమరుగు

ఆరిలోవ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాత డెయిరీ ఫారం సమీపంలో గల బస్సు షెల్టర్ వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ అంతా ఆక్రమణకు గురవుతోంది. దీనిపై అధికారులు కిమ్మనకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారుల సహకారంతోనే ఇక్కడ కర్రల డిపోలు ఏర్పాటు అయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఆక్రమణల వల్ల పచ్చదనం కనుమరుగు అవుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇంత జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం ఈ విషయంలో పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇక్కడ ఆక్రమణల దెబ్బకు బస్ షెల్టర్ కూడా ఇంచుమించు కనుమరుగైంది. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు కూర్చోడానికి అవకాశం కూడా లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతమంతా నాటుకోళ్ల వ్యాపారాలు చేసేవారు ఆక్రమించి పచ్చదనం ఏ మాత్రం లేకుండా చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.



పాత డెయిరీ ఫారం సమీపంలోని గ్రీన్‌బెల్ట్ స్థలంలో ఏర్పాటు చేసిన కర్రల డిపో

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో గ్రీన్‌బెల్ట్ స్థలం ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

బాలికలకు మెరుగైన వైద్యం

» మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి
» కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం విద్యార్థినులకు పరామర్శ



బాలికను పరామర్శిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరి జన బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు కేజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించి, వైద్య సేవల గురించి ఆరా తీశారు. తొలుత ఐసోలేషన్, రాజేంద్రప్రసాద్, పిల్లల వార్డుకు వెళ్లి విద్యార్థినులను పరామర్శించి, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 129 మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. 37 మందిని కేజీహెచ్‌లో చేర్పించామని, వారికి పరీక్షలు నిర్వహించగా పచ్చకామెర్లతో బాధప డుతున్నట్టు తేలిందన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్టు వెల్లడించారు. మిగిలిన బాలికలు పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. బాలికల్లో కొందరు హెపటైటిస్‌తో బాధపడుతు న్నారని, దీనివల్ల కొంతమేర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. హాస్టల్ వద్ద మెడికల్ టీమ్‌ను ఏర్పాటు చేసి మిగిలిన చిన్నారులకు పరీక్షలు చేయిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలలో పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉన్నాయని, కొత్తగా 40 టాయిలెట్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వాతావరణం మార డం వల్ల ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయని, పిల్లలు పండగలకు వెళ్లి వచ్చిన తరువాత కొంతమేర అస్వస్థతకు గురవుతుంటారన్నారు. బాలికలు అస్వస్థతకు గురవ్వడంపై విచారణ చేస్తున్నామని, ఎవరి తప్పిదమైనా ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, ఆర్ఎంవోలు బంగారయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం : పోలీసుల అదుపులో నిందితుడు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ సమీపంలో ఓ వ్యక్తి నుంచి బాణసంచాను ఎంవీపీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం టాస్క్ ఫోర్స్ ఎస్ఐ భరత్ కుమార్, ఎంవీపీ పోలీసులు అప్పుఘర్ సూవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. అక్కడకు సమీపంలో ఓ వ్యక్తి తొమ్మిది బ్యాగులతో నిలబడి ఉన్నాడు. పోలీసులను చూసి, అనుమానంతో అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా, పోలీసులు పట్టుకుని ప్రశ్నించారు. అతడి వద్ద సంచుల్లో తారాజువ్వలు, చిచ్చు బుడ్డీలు, కమ్మరేకు బాంబులు వంటి బాణసంచా ఉంది. అతడు తన పేరు బాంబుల పోలయ్య (55) అని, ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో ఉంటానని తెలిపాడు. అనుమతి లేకుండా తాను వీటిని తయారు చేసినట్టు చెప్పాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

చెట్లు నేలమట్టం.. జూపార్కు కళావిహీనం

» గాలివాన దెబ్బకు నేల కూలిన వృక్ష సంపద » కూలిన సుమారు 120 వృక్షాలు » బోసిపోయిన జంతు ప్రదర్శన శాల



సింహాల మోటులో కూలిన చెట్లు



ఎలుగుబంటి మోటులో వేళ్లతో కూలిన చెట్టు

ఆరిలోవ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి రోజు గాలివాన దెబ్బకు ఇందిరా గాంధీ జూపార్కులో పలు చెట్లు నేల కూలాయి. సుమారు 120 వరకు చెట్లు నేల కొరిగాయి. దీంతో జూపార్కు నిస్తేజంగా తయారైంది. చక్కని వృక్ష సంపదతో పచ్చగా కనిపించే జూ పార్కు బోసి పోయింది. జూపార్కులో రోడ్డునకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో జూలో గల వాహనాలు కూడా తిరగలేని పరిస్థితి నెలకొంది. దీంతో దారిలో పడిపోయిన చెట్ల కొమ్మలను జూ సిబ్బంది యుద్ధప్రాతిపదకన తొలగించారు. సింహాల మోటులో పలు చెట్లు వేర్లతో నేలకొరిగింది. దీంతో సింహాలను మోటులోకి విడిచి పెట్టకుండా వాటిని నైట్ హౌస్‌లో ఉంచారు. అలాగే సాంబార్లు (కణుజులు) మోటు వద్ద కూడా పలువృక్షాలు నేలకొరిగాయి. ఎలుగు బంటులు ఉన్న మోటు వద్ద, జూ క్యాంటీన్ సమీపంలో గల ఎమ్యూజ్‌మెంట్ పార్కులో పిల్లలు ఆడుకొనే పలు ఆట పరికరాలపై కూడా చెట్లు పడిపోయాయి. చిన్నారులు కూడా అక్కడ ఆడలాడుకోలేని పరిస్థితి నెలకొంది. జూలో పడిన చెట్ల తొలగింపు, ఇతర సహాయక చర్యలు పూర్తయ్యేందుకు సుమారు 10 రోజుల సమయం పట్టేలా ఉందని సిబ్బంది తెలిపారు.



రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను నరికి పోగు వేసిన జూ సిబ్బంది



సాంబార్ల (కణుజులు) మోటులో నేలకొరిగిన వక్షం

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

» ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో 'సోలార్ పవర్ ఫుల్ ఎందుకీ నిర్లక్ష్యం' అన్న శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ గత ఏడాది కేంద్ర ప్రభుత్వం దేశంలో కోటి మంది వినియోగదారుల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు ప్రధాన మంతి సూర్యఘర్ ముఫ్త్‌బిజిలీ యోజనను ప్రారంభించిందని తెలిపారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో విస్తృతంగా సమావేశాలు నిర్వహించడం, కరపత్రాలు పంపిణీ, గోడపత్రికలు, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీలు, సంస్థ ఉద్యోగులతో ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రూ. 2.5 లక్షల బ్యాంక్ గ్యారంటీ సమర్పించి, అయిదేళ్ల పాటు సర్వీస్ అందిస్తామని, గ్యారంటీ ఇచ్చిన వారిని వెండర్లుగా పేరు నమోదు చేసుకోవడానికి ఈపీడీసీఎల్ అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. వెండర్‌గా పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు నేరుగా ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సోలార్ పవర్ జనరల్ మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు.పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్ టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ చేసేందుకు 450 మంది కొత్త వెండర్స్‌కు అనుమతి మంజూరు చేశామని వివరించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూనర్ బిజినెస్ డెవలప్‌మెంట్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా వీరికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ పథకం 2027 మార్చి 31 వరకు మాత్రమే ఉంటుందని చెప్పారు. పథకం గురించి తెలుసుకోవాలన్నాసోలార్ ఇన్‌స్టాలేషన్ చేసుకున్నవారికి ఏమైనా సమస్యలున్నా ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సోలార్ పవర్ చీఫ్ జనరల్ మేనేజర్ 9441155166, జనరల్ మేనేజర్ 9440812376, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 7382585446 నంబర్లను సంప్రతించాలన్నారు.

భాగస్వామ్య సదస్సు పనులు త్వరితగతిన పూర్తిచేయండి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వచ్చేనెల 14, 15 తేదీల్లో జరిగే పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు ఏర్పాట్ల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ రోడ్డు, సిరిపురం జంక్షన్, సంపత్ వినాయగర్ ఆలయం రోడ్డు, ఆశీల్‌మెట్ట, పాతజైలురోడ్డు, గాజువాకలోని కృష్ణదేవరాయ జంక్షన్ నుంచి ఆర్కే ఆస్పత్రి జంక్షన్ వరకు పలు ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాగస్వామ్య సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు వస్తారని, వారిని ఆకర్షించేలా ఏర్పాట్లు, సుందరీకరణ పనులు జరగాలని అధికారులకు సూచించారు. ప్రతినిధులు ప్రయాణించే మార్గాలు, సందర్శించే ప్రాంతాల్లో రోడ్ల మార్జిన్ మార్కింగ్ చేయడం, సెంటర్ మీడియన్లలో అందమైన మొక్కలు నాటడం, పచ్చనదం అభివృద్ధి చేయడం, ఫుట్‌పాత్‌లపై పిచ్చిమొక్కలను తొలగించడం, ఫుట్‌పాత్‌లు, కెర్బ్‌లు, డివైడర్లకు రంగులు వేయడం, లైటింగ్ ఏర్పాట్లు పక్కా గా జరగాలని చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజును ఆదేశించారు. అలాగే సంపత్‌వినాయగర్ ఆలయం వద్ద ఐలాండ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గాజువాకలో కృష్ణదేవరాయ జంక్షన్ నుంచి ఆర్కే హాస్పటల్ జంక్షన్ వరకు ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను తక్షణమే పూర్తిచేయాలని ఈఈ రాయల్‌బాబును ఆదేశించారు. కమిషనర్ వెంట అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో రోడ్డు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు స్వాగతం పలుకుతున్న అంగముత్తు, తదితరులు

గోపాలపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం నగరంలో జరిగే షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గ్యాస్ ట్యాంకర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను ఆయన ఆదివారం ఇక్కడకు చేరుకున్నారు. కేంద్ర మంత్రికి విశాఖ పోర్టు ఇన్‌చార్జి ఛైర్మన్ అంగముత్తు, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

తోటగరువు జంక్షన్‌లో వరద నీరు

ఆరిలోవ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పెదగదిలి జంక్షన్‌లో వరద నీరు చేరింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వర్షం పడిన ప్రతిసారి పెదగదిలిలో ఈ విధంగా వరద నీరు నిలిచిపోతుండడంతో వాహనచోదకులు, స్థానికులు, చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతుంటారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీరు ఎప్పటి నుంచో కోరుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాని కోరుతున్నారు.

జూకు సందర్శకుల తాకిడి

» రూ.4 లక్షల 24 వేల 800ల ఆదాయం



తెల్ల పులుల మోటు వద్ద సందర్శకుల రద్దీ

ఆరిలోవ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. మొత్తం 5,808 మంది సందర్శించారు. వీరి నుంచ రూ.4 లక్షల 24 వేల 800ల ఆదాయం సమకూరినట్టు జ్యూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. జూ క్యాంటీన్ సమీపంలో గల మర్రిచెట్టునీడలో సందర్శకులు ఫలాహారాలు చేశారు. కాగా, ఇటీవల కురిసిన గాలివాన కారణంగా ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉన్నది. వివిధ జంతువుల మోటల వద్ద సందర్శకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

ఘనంగా దేవీ నవరాత్రుల ముగింపు ఉత్సవం



అన్న సమారాధన చేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఆరిలోవ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఆదివారం పెదగదిలి సమీపంలో గల ఈశ్వరదేవీ నగర్ కొండవాలు ప్రాంతంలో ఎర్ని దుర్గభైరవ అమ్మవారి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అభిరాం గురు భవానీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సుమారు 3 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం భారీ ఊరేగింపుతో నేలవేష నృత్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు, తప్పెడగుళ్ల మధ్య అమ్మవారి నిమజ్జన ఊరేగింపు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కాంతార-2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతుధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

క్రీడలతో మానసికోల్లాసం

» నేవీ అడ్మిరల్ మురళీ మనోహర్‌రాజు » ఉత్సాహంగా నేవీ సన్నాహక మారథాన్



పరుగు పందెంలో విజేతలకు బహుమతుల ప్రదానం

బీచ్ రోడ్డు, అక్టోబర్ 4, (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో ఒత్తిడికి దూరమై మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం సొంతమవుతుందని నేవీ అడ్మిరల్ మురళీ మనోహర్‌రాజు పేర్కొన్నారు. వచ్చే నెల 14న నేవీ మారథాన్ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ వద్ద తూర్పు నౌకాదళ ఆధ్వర్యంలో ట్రైల్ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఉద్యోగులంతా ఆసక్తి ఉన్న క్రీడాంశంలో సాధన చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఇటువంటి పరుగు పందాలు ప్రతి ఏటా ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పరుగు పందేల్లో పోటీ పడి విజేతగా నిలబడడం ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. అనంతరం పలువురు ఉద్యోగులు ఉత్సాహంగా పరుగుల పోటీలో పాల్గొన్నారు. ఆర్కే బీచ్ కాళికా మాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకూ పరుగుల పందాల్లో 10 కె, 5 కె పరుగు పందాలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అమిత్ సిన్హా, స్వాతి సిన్హా, అనురాధ రాయ్, కెప్టెన్ వినోద్ తివారి, మేఘంట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక మారథాన్‌లో పాల్గొన్న నేవీ అధికారులు, సిబ్బంది

సాఫీగా ముగిసిన ఏపీపీ పరీక్ష

అమరావతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టులకు జరిగిన రాత పరీక్ష సాఫీగా ముగిసింది. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు నాలుగు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,494మంది అభ్యర్థులు హాజరైనట్టు రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. పరీక్షకు సంబంధించిన ఆన్సర్‌కీ సోమవారం మధ్యాహ్నం 12గంటలకు విడుదల చేస్తామని చెప్పారు. అభ్యంతరాలున్న వారు ఈ నెల 8లోగా ఎస్ఎల్‌పీ ఆర్‌బీకి మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు.అర్హత మార్కులు సాధించిన వారికి త్వరలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు శాప్, రైల్వే క్రీడా నిపుణులు



వైకుంఠరావు



ఆనందలక్ష్మి



శ్రీనివాస్

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, వాల్తేరు రైల్వే క్రీడా నిపుణులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 10 నుంచి భువనేశ్వర్‌లో జరగనున్న 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి కోచ్ కె.వైకుంఠరావు, వాల్తేరు రైల్వే నుంచి సీనియర్ అథ్లెట్ పిట్టా శ్రీనివాసరావు కోచ్‌లుగా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన కె.ఆనందలక్ష్మి అనౌన్సర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతిష్ఠాత్మక జాతీయ అథ్లెటిక్స్ టోర్నీలో ఆంధ్ర నుంచి 13 మంది బాలురు, 10 మంది బాలికలతో కూడిన జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ ఎం.నారాయణరావు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు

ఆరిలోవ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులోని రాజీవ్ నగర్‌లో కన్స్యూమర్ కౌన్సిల్ వారి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. అలాగే దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా టూత్‌పేస్టులను అందించారు. కార్యక్రమం విహెల్త్ కేర్ వాషిన్ ఐ కేర్, వి డెంటల్ వైద్యులు సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందించారు.

రైల్వేలో స్వచ్ఛత మిషన్ 5.0 ప్రత్యేక డ్రైవ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛత ప్రత్యేక ప్రచార 5.0 కార్యక్రమాలలో భాగంగా వాల్తేరు రైల్వే ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించనుందని డీఆర్ఎం లలిత్ బొహ్రా పేర్కొన్నారు. రైల్వే బోర్డు మార్గదర్శకాల మేరకు స్వచ్ఛత మిషన్ 5.0 ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటెన్సివ్ క్లీనింగ్ డ్రైవ్‌లు, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యర్థాలు/వస్తువులు పారవేడయంతోపాటు పరిశుభ్రత నిర్వహణకు సంబంధించి పెండింగ్ ఫైళ్లను సమీక్షిస్తామన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆది వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని, గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పులు తీసుకురావాలని సూచించారు.

నగరానికి భారత్ మహిళల క్రికెట్ జట్టు రాక నేడు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఈ నెల 9న ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరగనున్న వన్డే మ్యాచ్‌లో పాల్గొనే భారత్ మహిళల క్రికెట్ జట్టు సోమవారం నగరానికి చేరుకోనుంది. సోమవారం ఉదయం 10.30కు చార్టెడ్ ఫ్లైట్‌లో కొలంబో నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరనున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో నోవాటెల్ హోటల్‌కు చేరుకుంటారు.

రేపు దక్షిణాఫ్రికా జట్టు రాక

ఈ నెల 9న భారత్‌తో తలపడనున్న దక్షిణాఫ్రికా జట్టు మంగళవారం ఉదయం 10.15 గంటలకు చార్టెడ్ ఫ్లైట్‌లో ఇండోర్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో నేరుగా ద పార్క్ హోటల్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు.

మిథు, శ్రీనివాసరావులకు అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు తీసుకుంటున్న బి.మిథు, శ్రీనివాసరావు

కంచరపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో ప్రైవేటు స్కూల్లో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు ఐకాన్ అకాడమిక్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేసింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు విజయవాడలో నిర్వహించారు. కంచరపాలెంలో న్యూటన్ పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని మిథు, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావులు అవార్డులకు ఎంపికయ్యారు. ఆదివారం గౌరవ అతిథులు, అప్సా రాష్ట్ర నాయకులు వి.సుబ్రహ్మణ్య రాజు, టి.సింహాచలం, ఇతర అసోసియేషన్ ప్రతినిధుల నుంచి ఈ అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా మిథు, శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని, ఉన్నతమైన విద్యాప్రమాణాలు అందించడానికి మరింతగా కృషిచేస్తామన్నారు.

భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగుల ధర్నా నేడు

సీతమ్మధార, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పది నెలలుగా తమ న్యాయమైన సమస్యలను సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకునేందుకు విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు విన్నవించుకున్నప్పటికీ ఉదాసీనంగా వ్యవహరించడం, ఉద్యోగుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ, ఏపీఈపీడీసీఎల్ డిస్కం యూనిట్ చైర్మన్ వీఎస్ఆర్‌కే గణపతి తెలిపారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐకాస దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించి, విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు నోటీసు ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లా కేంద్రాల్లో సోమవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించి, నిరసన వ్యక్తం చేస్తారన్నారు. పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పొరుగు సేవల సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఇతర సమస్యలపై ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో 6న డిస్కం యూనిట్ ధర్నాను జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నటి సంధ్యా శాంతారామ్ మృతిపై వీఎఫ్ఎస్ సంతాపం

డాబాగార్డెన్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హిందీ సినిమాల్లో పాత తరానికి చెందిన ప్రముఖ నటి, నృత్యకారిణి సంధ్య శాంతారామ్ ఆకస్మిక మరణంపై వైజాగ్ ఫిల్మ్ సొసైటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఆమె పలు మరాఠీ, హిందీ సినిమాల్లో నటించి పేరుగాంచారని సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఆమె మరణం హిందీ పరిశ్రమకు తీరని లోటన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

స్టాప్‌లో బస్సులు ఆపక ప్రయాణికుల ఇబ్బందులు


స్టాప్‌కు దూరంగా ఆగిన బస్సు వద్దకు వెళ్తున్న మహిళా ప్రయాణికులు

మహారాణిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్‌స్టాప్‌లో బస్సులను ఆపటం లేదని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. స్టాప్ దగ్గరకు వచ్చేసరికి బస్సులను అత్యంత వేగంగా నడుపుతూ ప్రయాణికులను పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ సిబ్బంది తీరుపై ఇప్పటికే కొందరు డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని ప్రకటించటంతో ప్రయాణాలకు ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. సుమారు 70 శాతం మంది మహిళలతోనే బస్సు కిటకిటలాడుతోంది. ఏ స్టాప్‌లో చూసినా మహిళా ప్రయాణికులు గుంపులుగా కనిపిస్తున్నారు. దీనితో ఉచిత బస్సు పథకం సూపర్ హిట్ అయ్యింది. కానీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. వీరు పని ఒత్తిడి కారణంగా రకరకాలుగా ప్రవర్తిస్తున్నారు. ప్రయాణికులను కావాలనే ఇబ్బందులకు గురి చేసేలా వ్యవహరిస్తున్నారు. బస్టాప్‌లో ప్రయాణికులు నిరీక్షిస్తున్నా బస్సు ఆపకుండా ముందుకు పోనిచ్చి అక్కడ ఆపుతున్నారు. దీనితో మహిళలు, ఇతర ప్రయాణికులు బస్సు దగ్గరకు పరుగులంకించవలసి వస్తుంది. బస్సు దిగే వారితో పాటు బస్సు ఎక్కేవారు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో మహిళలు ముందు ద్వారం నుంచే బస్సు ఎక్కేవారు. ఇప్పుడు ఆ ప్రయాణికుల సంఖ్య పెరగడంతో వెనుక ద్వారాన్ని కూడా వారు వినియోగించుకుంటున్నారు. ఈ విషయం డ్రైవర్లు గమనించకుండా బస్సును పోనిస్తూ ఉండటంతో బస్సు ఎక్కే సమయంలో మహిళలు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రభుత్వ నర్సు ఒకరు ప్రమాదానికి గురికావడంతో స్టీల్ ప్లాంట్ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు అందింది. నగరవ్యాప్తంగా అన్ని బస్సు స్టాప్‌ల వద్ద ఇలాంటి పరిస్థితే నెలకొని ఉంది. అధికారులు సిబ్బందికి సూచనలిచ్చి ఊరుకోకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు 15 జాతీయ స్థాయి ర్యాంకులు


ప్రధాని నరేంద్ర మోదీ నుంచి అవార్డు స్వీకరిస్తున్న వందన (పెయింటర్)

కంచరపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో శిక్షణ పొందుతున్న 15 మంది విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు లభించాయి. 2024-2025 విద్యాసంవత్సరానికి ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం న్యూఢిల్లీలో జరిగిన స్కిల్ కాన్వొకేషన్ వేడుకలో ప్రధాని నరేంద్ర మోదీ నుంచి అవార్డులు స్వీకరించారు. ఈ ఏడాది జరిగిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)లో కూడా 150/150 మార్కులను 26 మంది సాధించారన్నారు. జాతీయ స్థాయిలో డి.వందన 1199/1200 (పెయింటర్ విభాగంలో ప్రథమ ర్యాంకు), ఆర్&ఏసీ ట్రేడ్‌లో పి.మధులత (1194/1200) మార్కులు, ఎస్.యామిని వరలక్ష్మి వుడ్ వర్క్ టెక్నీషియన్ (కార్పెంటర్) 595/600 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకులు పొందారన్నారు. ఈ ముగ్గురికి ప్రధాని మోదీ అవార్డులు అందించారన్నారు. అధునాతనమైన మౌలిక వసతులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు నిష్ణాతులైన ఇన్‌స్ట్రక్టర్లు ప్రభుత్వ ఐటీఐలో పనిచేస్తున్నారన్నారు. వీరి బోధన, కృషితోపాటు విద్యార్థుల పట్టుదల తోడై జాతీయ స్థాయిలో ర్యాంకులు వచ్చాయన్నారు. అవార్డులు పొందిన విద్యార్థులను జోన్-1 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, ఎల్ఎంసీ చైర్మన్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

వైసీపీ నుంచి జనసేనలోకి పలువురి చేరిక


జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో 29వ వార్డులో వైసీపీ నుంచి సుమారు వంద మంది యువకులు జనసేనలో చేరారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా వంశీకృష్ణ శ్రీనివాస్ దక్షిణ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులైన వెంకటేశ్వర నగర్ ప్రాంతానికి చెందిన మజ్జి శ్రీను, దువ్వి లోకేష్, అడ్వకేట్ శ్రీనివాస్, కట్టా అనిల్ రాజ్, అమర్నాథ్, రాహుల్, వీర విజయ్ తదితరులు అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన నాయకత్వం బలంగా ఉన్నచోటనే ఎక్కువ అభివృద్ధి పనులు జరుగుతాయని తద్వారా ప్రజలు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని తనకు ఎప్పుడూ చెబుతుంటారని, మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్ పి.వి. శివప్రసాద్ రెడ్డి, కూటమి ఇంచార్జ్ గొలగాని రవీశ్వరరావు, మాజీ కార్పొరేటర్ బద్దుల అనురాధ, మాన్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్వ నేచురల్స్ ఆధ్వర్యంలో కుక్ వేర్ ఎగ్జిబిషన్ కమ్ సేల్


అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

సీతంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 వరకు రామాటాకీస్ రోడ్డులో గల అంబేద్కర్ భవన్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు సత్వ నేచురల్స్ (సీతమ్మధార) ఆధ్వర్యంలో కుక్ వేర్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రముఖ బ్రాండ్‌లైన ఇండస్ వేలి, వండర్ చెఫ్, ప్రెస్టీజ్ ప్రొడక్ట్‌లపై 50 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాత అల్యూమినియం వంట పాత్రల మార్పిడిపై అదనపు తగ్గింపు కూడా ఉందన్నారు. ట్రై ప్లే స్టీల్, కాస్ట్ ఐరన్, ఐరన్, సిరామిక్, ఇత్తడి వంట పాత్రలు, గాజు, రాతి, చెక్క పరికరాలు, ఇతర ఆర్గానిక్ ఉత్పత్తులు ఇక్కడ విక్రయిస్తున్నారు. ప్రముఖ ఆర్గానిక్ ఉత్పత్తుల కంపెనీలు 24 మంత్ర, నేచర్ ల్యాండ్ ఆర్గానిక్ తత్వ ప్యూర్ అండ్ షూర్ ప్రో నేచర్, కపీవ, మిల్లెట్ బ్యాంక్, జీని, ఎన్ రిచ్ సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేసి 25 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నాయి. ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా చిరుధాన్యాలతో చేసిన చిరుతిండ్లు విక్రయిస్తున్నారు. అధిక డిస్కౌంట్లతో పాటు లక్కీ డ్రా ద్వారా ప్రత్యేక బహుమతులు పొందవచ్చని నిర్వాహకురాలు వనుకూరు లక్ష్మీతేజ తెలియజేశారు.

కలుషిత నీటి వల్లే గిరిజన బాలికలకు పచ్చకామెర్లు

▸▸ వైసీపీ నాయకుల ఆరోపణ

మహారాణిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో కలుషిత నీరు తాగడం వల్ల గిరిజన బాలికలు పచ్చకామెర్ల వ్యాధితో అస్వస్థతకు గురయ్యారని మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి ఆరోపించారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన విద్యార్థినుల వసతిగృహంలో పచ్చకామెర్ల వ్యాధి సోకి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 37 మంది విద్యార్థినులను వైసీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ గిరిజన పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్ పనిచేయటంలేదని, సురక్షితమైన తాగునీరు అందించక పోవటం వల్ల సుమారు నెలన్నర క్రితమే విద్యార్థినులు పచ్చకామెర్ల వ్యాధికి గురయ్యారని, వారిలో అంజలి, కల్పన అనే ఇద్దరు బాలికలు సైతం మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరు మృతిచెందారని, ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారని తెలిపారు. సంధ్యారాణి అసమర్థ మంత్రి అని, పిల్లలు ఐదు రోజులుగా అనారోగ్యానికి గురైతే నేడు తీరికగా వచ్చారని ఆక్షేపించారు. అరుకు ఎంపీ తనూజా రాణి మాట్లాడుతూ ప్రభుత్వం, మంత్రి అసమర్థతతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తదితరులు విద్యార్థినులను పరామర్శించారు.

రైల్వేలో స్వచ్ఛత మిషన్ 5.0 ప్రత్యేక డ్రైవ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛత ప్రత్యేక ప్రచార 5.0 కార్యక్రమాలలో భాగంగా వాల్తేరు రైల్వే ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించనుందని డీఆర్ఎం లలిత్ బొహ్రా పేర్కొన్నారు. రైల్వే బోర్డు మార్గదర్శకాల మేరకు స్వచ్ఛత మిషన్ 5.0 ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటెన్సివ్ క్లీనింగ్ డ్రైవ్‌లు, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యర్థాలు/వస్తువులు పారవేయడంతోపాటు పరిశుభ్రత నిర్వహణకు సంబంధించి పెండింగ్ ఫైళ్లను సమీక్షిస్తామన్నారు. పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను స్థిరమైన సంస్థాగత పద్ధతిగా అమలు చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రైల్వే స్టేషన్లలో రైల్ చౌపాల్, '105 అమృత్ భారత్ స్టేషన్లలో అమృత సంవాద్' వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. పరిశుభ్రతపై కొత్త ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యంగా అధికారుల పర్యవేక్షణలో స్వచ్ఛత మిషన్ 5.0 ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు శాప్, రైల్వే క్రీడా నిపుణులు


వైకుంఠరావు ఆనందలక్ష్మి శ్రీనివాస్

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, వాల్తేరు రైల్వే క్రీడా నిపుణులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 10 నుంచి భువనేశ్వర్‌లో జరగనున్న 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి కోచ్ కె.వైకుంఠరావు, వాల్తేరు రైల్వే నుంచి సీనియర్ అథ్లెట్ పిట్టా శ్రీనివాసరావు కోచ్‌లుగా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన కె.ఆనందలక్ష్మి అనౌన్సర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతిష్ఠాత్మక జాతీయ అథ్లెటిక్స్ టోర్నీలో ఆంధ్ర నుంచి 13 మంది బాలురు, 10 మంది బాలికలతో కూడిన జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎం.నారాయణరావు తెలిపారు.

ముగిసిన నాసా ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ చాలెంజ్ కార్యక్రమం

సీతమ్మధార, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల్లో ప్రజ్ఞా రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, కళాశాల సంయుక్తంగా నిర్వహించిన నాసా ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ చాలెంజ్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. విద్యార్థులంతా లెర్న్, లాంచ్, లీడ్ అనే థీమ్‌తో నిర్వహించిన గ్లోబల్ హ్యాకథాన్‌లో యువ ఆవిష్కరణలు, కోడర్లు, పరిశోధనలకు నాసా ఓపెన్ సోర్స్ డేటాను ఉపయోగించి ప్రభావవంతమైన పరిష్కారాలను రూపొందించారు. ఈ హ్యాకథాన్‌లో టీమ్ 18 కోడ్ క్లౌడ్, టీమ్ 11 టెక్నో టైటాన్స్, టీమ్ 78 ఏరోలిత్ ఎక్స్, టీమ్ 73 ఆస్ట్రో విజన్, టీమ్ 77 ఎర్తింక్స్ అనే అంశాలతో మొదటి అయిదు స్థానాల్లో నిలిచాయి. ఎన్ఎస్‌టీఎస్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్, బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దీపక్ చౌదరి, డాక్టర్ జీఎస్‌కె చక్రవర్తి, డి.భుజంగరావు, డాక్టర్ జి.వంశీకృష్ణ, డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖలు ప్రారంభం


మారికవలసలో నూతన శాఖను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ నికేశ్ కుమార్ సిన్హా

కొమ్మాది, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు, వ్యాపారులు సహా అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేశ్ కుమార్ సిన్హా అన్నారు. ఆదివారం ఆయన మారికవలస, తగరపువలసలో ఆ బ్యాంకు నూతన శాఖలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలను విస్తరించడం ద్వారా ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్.సీతారాం మాట్లాడుతూ తమ బ్యాంకులో డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, అన్ని రకాల సేవలు ఉంటాయని తెలిపారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఉత్సవానికి 60 బస్సు సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాలకు 60 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేయనున్నారు. ప్రతిరోజూ 20 ప్రత్యేక సర్వీసులు చొప్పున సోమ, మంగళ, బుధవారాల్లో నడపనున్నారు. విశాఖ నుంచి విజయనగరానికి ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు ఉంటుంది. స్టీల్ సిటీ డిపో, విశాఖ డిపో, మద్దిలపాలెం బస్‌స్టేషన్, ద్వారకా కాంప్లెక్సు, గాజువాక డిపోల నుంచి వీటిని ఆపరేట్ చేయనున్నారు. విజయనగరంలో పైడితల్లమ్మ ఉత్సవాలకు విశాఖ నుంచి ఎక్కువ మంది భక్తులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణ ప్రయాణికులు, ఉత్సవాలకు రాకపోకలు సాగించే వారి వల్ల షెడ్యూల్ సర్వీసుల సామర్థ్యానికి మించి ప్రయాణికుల డిమాండ్ ఉంటుందని ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేసేందుకు నిర్ణయించారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక సర్వీసులు సిద్ధం కానున్నాయి. ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటే సర్వీసుల సంఖ్య పెంచుతామని ఆర్ఎం అప్పలనాయుడు వెల్లడించారు.

ఆ రోడ్డులో కుక్కలు హల్‌చల్..


ఆశీర్వాద్ కల్యాణ మండపం వద్ద కుక్కల గుంపు

కంచరపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి ఆశీర్వాద్ కల్యాణ మండపం నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. గుంపులుగా కుక్కలు తిరుగుతుండడంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు భయపడుతున్నారు. ఈ మార్గంలో విద్యుత్ దీపాలు లేక చీకటిలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. చీకటిలో కుక్కలు అకస్మాత్తుగా రోడ్డుకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు కుక్కలను నియంత్రించాలని, ఈ మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

'గూగుల్ డేటా సెంటర్‌ను అడ్డుకుంటే సహించం'

అక్కయ్యపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్‌ను అడ్డుకుంటే సహించేది లేదని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హెచ్చరించారు. గూగుల్ సెంటర్ కావాలని కోరుకుంటున్న నిరుద్యోగ యువతతో కలిసి త్వరలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని, యువత ఉద్యోగ ఉపాధిని అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారని వైసీపీని విమర్శించారు. రైతుల ముసుగులో వైసీపీ నాయకులు గూగుల్ డేటా సెంటర్‌ను అడ్డుకోవడానికి వేస్తున్న కేసులను, వేలాది మంది యువత మద్దతుతో వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కృషితో ఐటీ పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ కల్పన, అభివృద్ధికి ఆకర్షితులయ్యారన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. లోకేశ్‌కు మంచిపేరు వస్తుందనే అక్కసుతో గూగుల్ డేటా సెంటర్‌ను వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

కూలిన డిగ్రీ కళాశాల ప్రహరీ గోడ

డాబాగార్డెన్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాత జైల్‌రోడ్డులో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రహరీ గోడపై భారీ చెట్టు కూలడంతో గోడ కూలిపోయింది. దసరా పండుగ రోజు కళాశాలకు సెలవు కావడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని ప్రిన్సిపాల్ డా.ఆర్.మంజుల తెలియజేశారు.

మూడు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్

... 3వ పేజీ తరువాయి

ద్వారా మంచి ఆదాయం వస్తోంది. గంభీరం పంచాయతీ పరిధిలో చిన్న పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, భూముల విక్రయాలు ఉండడంతో ఏడాదికి రూ.1.5 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. ఆనందపురం మండలం వేములవలస పంచాయతీకి సంత ఆదాయం, దుకాణాలతో పాటు రిజిస్ట్రేషన్లు వల్ల రూ.1.2 కోట్ల ఆదాయం వస్తోంది. దాకమర్రి పంచాయతీలో ఇటీవల భూముల క్రయవిక్రయాలు పెరగడంతో ఆదాయం రూ.కోటి దాటింది. దీంతో ఈ మూడు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా లభించనున్నది. ఈ హోదా లభించిన పంచాయతీలకు కార్యదర్శిగా డిప్యూటీ మండల అభివృద్ధి అధికారిని నియమించడంతో పాటు సిబ్బందిని కేటాయిస్తారు. అలాగే ఆర్థిక సంఘం నిధులు ఎక్కువగా రానున్నాయి. ఏటా రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ఆదాయం వచ్చే పంచాయతీలకు గ్రేడ్-1, రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల ఆదాయం వచ్చే పంచాయతీలకు గ్రేడ్-2 హోదా కల్పిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సుమారు 15 గ్రామ పంచాయతీలకు గ్రేడ్-1 హోదా లభించే అవకాశం ఉంది. పంచాయతీలకు గ్రేడ్ల కేటాయింపునకు సంబంధించి త్వరలో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి.

పిడుగులతో దద్దరిల్లిన నగరం

... 3వ పేజీ తరువాయి

ఉలిక్కిపడ్డారు. సాయంత్రం తీరానికి చేరిన వారు తడిసి ముద్దయ్యారు.

నగరంలో పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఆరుబయట వ్యాపారాలు చేసేవారంతా ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల సరుకులు తడిసిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మురుగుకాల్వలు పొంగాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. నగరంలోని మహారాణిపేట కామన్‌పాయింట్‌లో 53.75, గాజువాక కేబీఆర్ రిజర్వాయర్‌లో 52.5, గవరపాలెంలో 50.5, రెవెన్యూపార్కులో 49,75, గోపాలపట్నంలో 43.0, హెచ్‌బీకాలనీలో 41.5 మి.మీ.ల వర్షపాతం నమోదయింది.

రేషన్ డిపోల్లో బియ్యం నిల్

... 3వ పేజీ తరువాయి

పలుమార్లు డిపోలకు తిరగాల్సి వస్తోందని కార్డుదారులు వాపోతున్నారు. గోదాముల నుంచి డిపోలకు సరకు సరఫరా చేసే కాంట్రాక్టర్లు ప్రతి నెలా ఒకేసారి వాహనాల్లో తరలించేవారు. తాజాగా నెలకొన్న సమస్యతో రెండుమూడు సార్లు తిప్పాల్సి వస్తోందని, దీంతో అదనపు భారం పడుతోందని గగ్గోలు పెడుతున్నారు. నగరంలోని కార్డులతోపాటు పోర్టబిలిటీ ద్వారా వేలాదిమంది బియ్యంకార్డుదారులు డిపోల నుంచి బియ్యం తీసుకుంటున్నందున అందుకు తగినట్టు ఏర్పాట్లు చేయడంలో పౌరసరఫరాల సంస్థ విఫలమైందని డీలర్లు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

భాషా పండిట్లకు పదోన్నతులు

... 3వ పేజీ తరువాయి

ఉమ్మడి విశాఖ జిల్లాకు బదిలీపై వచ్చిన 48 మంది ఉపాధ్యాయులకు విద్యా శాఖ పోస్టింగ్స్ ఇచ్చింది. వీరిలో 16 మంది స్కూల్ అసిస్టెంట్, 32 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. ఎక్కువమందికి కేటగిరీ 3, 4 పరిధిలోని పాఠశాలల్లో పోస్టింగ్స్ దక్కాయి. దీనిపై కొందరు టీచర్లు అభ్యంతరం వ్యక్తంచేసి ఆందోళనకు దిగినా.. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏజెన్సీ, మారుమూల ప్రాంత పాఠశాలల్లో నియమించారు.

ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం


చీకటి రమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్ సెల్ (హెచ్ఆర్‌సీ) ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆదివారం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథిగా హెచ్ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు హాజరై ప్రసంగించారు. విశిష్ట అతిథిగా ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి హాజరయ్యారు. అనంతరం జాతీయ ఉపాధ్యాయులు రాంపాల్ సింగ్ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పల రాజు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత, శ్యామల, విన్నకోట ఫణికుమార్, ఎ.రామలక్ష్మిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌సీ నాయకులు సుదర్శన పట్నాయక్, ఎంఎస్‌వీ విశ్వనాథం, మంగయ్య నాయుడు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకునిగా చీకటి రమేష్

మహారాణిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నగరానికి చెందిన చీకటి రమేష్ ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో సీతారామరాజు సమావేశమందిరంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. దక్షిణ నియోజకవర్గంలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న చీకటి రమేష్‌కు ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రకటించి అవార్డుతో సత్కరించారు. ఈ సమావేశంలో పలువురు అధ్యాపకులు, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

తాగే నీరు స్వచ్ఛమేనా?

... 3వ పేజీ తరువాయి

డయేరియా, అతిసార వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. దీంతో పరీక్షలు చేయించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక్కడకు వస్తున్న నమూనాల్లో పీహెచ్, టీడీఎస్ (సోడియం, పొటాషియం లెవెల్స్), కలర్, టర్బిడిటీ (మురికిగా ఉందా లేదా), క్లోరిన్ (మోతాదు), నైట్రైట్ (డ్రైనేజీ నీరు కలిసిందా లేదా), హార్డ్‌నెస్, ఆల్కలినిటీ (బేసిక్ ఎలిమెంట్స్ అయిన కాల్షియం, మెగ్నీషియం ఉన్నాయా లేదా) అన్నది పరీక్షిస్తుంటారు. కాగా ప్రస్తుతం వస్తున్న నమూనాల్లో పీహెచ్ తక్కువగా ఉన్నట్టు తేలిందని అధికారులు చెబుతున్నారు. పీహెచ్ (పవర్ ఆఫ్ హైడ్రోజన్) తక్కువగా ఉంటే గ్యాస్ట్రిక్ ఇరిటేషన్స్ వంటి ఇబ్బందులు వస్తాయని, టీడీఎస్ కూడా తక్కువగా ఉందని తేలుతోంది. దీని వల్ల శరీరానికి అవసరమైన సోడియం, పొటాషియం, కాల్షియం వంటి మినరల్స్ అందవు. దీనివల్ల శక్తిహీనంగా మారడంతో పాటు రక్త సరఫరా తగ్గుతుంది. అతి తక్కువ నమూనాల్లో మాత్రమే క్లోరిన్, నైట్రైట్ సంబంధిత సమస్యలున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.



భలే భలే.. పిగ్మీ జాతి మేక!

గోపాలపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మనం సాధారణంగా మైదాన ప్రాంతంలో పెరిగే మేకలను, ఏజెన్సీలో పెరిగే కొండ మేకలను చూస్తుంటాం. అయితే అందుకు భిన్నమైన ఆకారం, పరిమాణంలోనూ చిన్నగా ఉండే పిగ్మీ జాతి మేక నగరంలో సంచరించడాన్ని అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఆస్ట్రేలియన్ పిగ్మీ జాతికి చెందిన ఈ పొట్టి మేకను కొత్తపాలెం గ్రామానికి చెందిన రెహమాన్ అనే మాంసం వ్యాపారి పెంచుతున్నారు. నగరంలో ఇప్పటివరకు ఈ జాతి మేకలు కనిపించడం అరుదనే చెప్పాలి. సుమారు 20 అంగుళాల ఎత్తు, గరిష్ఠంగా ఏడు కిలోల బరువు ఉండే ఈ పిగ్మీ జాతి మేకను రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో పెంచుతుంటారు. తాను సరదాగా పెంచుకునేందుకు ఈ మేకను చిత్తూరు నుంచి ఇక్కడకు తెచ్చినట్టు రెహమాన్ తెలిపారు.

ఆటోవాలాలకు అండగా ప్రభుత్వం: కార్పొరేటర్ 'మొల్లి'

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు అన్నారు. దువ్వాడలో ఆదివారం జరిగిన ఆటోడ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారన్నారు. దీనివల్ల ఆటోడ్రైవర్లు ఉపాధి దెబ్బ తినకూడదనే ఉద్దేశంతో ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నాయకులు ఉరుకూటి శ్రీనివాస్, ఎం.రాము, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చలానాల డ్రైవ్

పెదగంట్యాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ కూడలిలో న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు ఆదివారం ట్రాఫిక్ చలానాల డ్రైవ్ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని ఆపి, చలానాలు పెండింగ్‌లో ఉన్నాయో లేదో పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న వాహనాల యజమానులతో వెంటనే చలానాలను కట్టించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో న్యూపోర్టు ఏఎస్ఐ శ్రీనివాసరాజు, హెచ్‌సీ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు నారాయణ, పైడిరాజు పాల్గొన్నారు.

7 నుంచి పైడితల్లమ్మ ఉత్సవాలు

ఆటోనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు శ్రీనివాసనగర్, ఎర్రగడ్డ కాలనీ,శ్రామికనగర్ ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీపైడితల్లమ్మ ఉత్సవాలను ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. 7న పాలాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, పుట్టబంగారం తేవడం, ఘటాల తిరువీధి ఉత్సవం, 12న అమ్మవారికి సారె ఊరేగింపు, 13న తొలేళ్లు, చండీ హోమం, 14 విశేష పూజలు, పరస చేపట్టనున్నారు.

సినిమా గైడ్

- **కాంతార2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 20, క్యారెట్ 54, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

బాలికలకు మెరుగైన వైద్యం

- మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం విద్యార్థినులకు పరామర్శ



కేజీహెచ్‌లో బాలికను పరామర్శిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు కేజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించి, వైద్య సేవల గురించి ఆరా తీశారు. తొలుత ఐసోలేషన్, రాజేంద్రప్రసాద్, పిల్లల వార్డుకు వెళ్లి విద్యార్థినులను పరామర్శించి, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 129 మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. 37 మందిని కేజీహెచ్‌లో చేర్పించామని, వారికి పరీక్షలు నిర్వహించగా పచ్చకామెర్లతో బాధపడుతున్నట్టు తేలిందన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్టు వెల్లడించారు. మిగిలిన బాలికలు పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. బాలికల్లో కొందరు హెపటైటిస్‌తో బాధపడుతున్నారని, దీనివల్ల కొంతమేర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. హాస్టల్ వద్ద మెడికల్ టీమ్‌ను ఏర్పాటు చేసి మిగిలిన చిన్నారులకు పరీక్షలు చేయిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలలో పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉన్నాయని, కొత్తగా 40 టాయిలెట్స్ నిర్మిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో వాతావరణం మారడం వల్ల ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయని, పిల్లలు పండగలకు వెళ్లి వచ్చాక కొంతమేర అస్వస్థతకు గురవుతుంటారన్నారు. బాలికలు అస్వస్థతకు గురవ్వడంపై విచారణ చేస్తున్నామని, ఎవరి తప్పిదమైనా ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, ఆర్ఎంవోలు బంగారయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పల్లెల్లో మ్యాజిక్ డ్రైయిన్లు



ఎస్ఆర్‌పురంలో నిర్మాణంలో ఉన్న మ్యాజిక్ డ్రైయిన్

- ప్రయోగాత్మకంగా ఎస్ఆర్‌పురంలో నిర్మాణం

పెందుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సరిగ్గా మురుగు కాలువలు ఉండవు. ఒకవేళ ఉన్నా ఓపెన్ డ్రైయిన్ల వల్ల దోమలు, ఈగలు ద్వారా వ్యాపించే జ్వరాలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం వినూత్నంగా మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణాన్ని చేపట్టింది. ఇందులోకి వచ్చే నీరు వెంటనే భూమిలోకి ఇంకేలా డ్రైయిన్లను డిజైన్ చేశారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద మండలంలోని ఎస్ఆర్‌పురంలో మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణాన్ని ప్రయోగాత్మంగా చేపట్టారు. ఈ మ్యాజిక్ డ్రైయిన్లతో మురుగు నీరు వెంటనే భూమిలోకి ఇంకుతుంది. ఇళ్లల్లోని వాడుక నీరు భూమిలోకి ఇంకేలా మూడు కిలోమీటర్ల డ్రైయిన్‌ను నిర్మిస్తారు. అక్కడ నుంచి భూమిలోకి ఇంకేలా 1.5 మీటర్ల లోతున గుంత తీస్తారు. కంకరరాళ్లను అమర్చి పైన చిప్స్ వేస్తారు. దీనివల్ల వ్యర్థపు నీరు ఇంకుడుగుంతలోకి చేరి, తరువాత భూమిలోకి చేరడం ద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. సాధారణంగా వంద మీటర్ల డ్రైయిన్లను నిర్మించడానికి రూ.4 లక్షల వ్యయమైతే మ్యాజిక్ డ్రైయిన్‌కు కేవలం రూ.90 వేలు ఖర్చవుతుంది. ఆశించిన ఫలితాలొస్తే ప్రతి గ్రామంలో మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు తెలిపారు.

సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటుపై నిరసనలు



పెదగంట్యాడ కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గాజువాక, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టు సమీపంలో అదానీ సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజల నుంచి సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించి ఈ నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. దీంతో దీనిని అడ్డుకోవాలంటూ ఇప్పటికే పలు ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు ప్రజలను చైతన్యపరుస్తున్నారు. గంగవరం పోర్టు, స్టీల్ ప్లాంట్, తదితర పలు కర్మాగారాల వల్ల గాజువాక పరిసరాల్లోని ప్రజలు ఇప్పటికే కాలుష్య సమస్యతో అల్లాడుతున్నారు. ఇలాంటి తరుణంలో సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

పాత గాజువాక కూడలిలో సీపీఎం ఆందోళన

అదానీ సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పాత గాజువాక కూడలిలో నిరసన చేపట్టారు. ప్రజలను చైతన్యపరచడంలో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని ప్రాంతాల్లో ఆటోల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టినట్టు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, అయోధ్యరామయ్య, జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో సీపీఐ ఆధ్వర్యంలో..

పెదగంట్యాడ: పెదగంట్యాడ సమీపాన సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలంటూ సీపీఐ గాజువాక శాఖ ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో ఆందోళ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే వివిధ పరిశ్రమల వల్ల ఈ ప్రాంతంలో కాలుష్యం చాలా ఎక్కువగా ఉందని, ఇప్పుడు సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటైతే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ అంబుజా సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును స్థానికులంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ నెల 8న జరిగే ప్రజాభిప్రాయ సేకరణ అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును వ్యతిరేకించాలని కోరారు. నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, పల్లేటి పోలయ్య, కె.పోతయ్య, పి.దుర్గారావు, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ తీర్మానం

అంబుజా సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును వ్యతిరేకించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీర్మానం చేశారు. నడుపూరు రామాలయ రచ్చబండ వేదిక వద్ద గాజువాక పట్టణ కాంగ్రెస్ నాయకులు సమావేశమై ఈ మేరకు తీర్మానం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిని తహశీల్దారుకు, కాంగ్రెస్ అధిష్టానానికి ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశంలో నాయకులు జె.ముత్యాలు, ఎం.రాజబాబు, యరబాల భూలోక, ఎంఎస్ వర్మ, కోరాడ చిన్నారావు, అప్పలనరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో నాగుపాము కలకలం



నాగుపాముతో స్నేక్ క్యాచర్ నాగరాజు

మల్కాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలో ఆదివారం నాగుపాము కలకలం రేపింది. ఓ ఇంటి బాత్‌రూమ్‌లోకి స్నానం చేసేందుకు బాలుడు వెళ్లగా లోపల నాగుపాము కనిపించడంతో భయంతో బయటకు పరుగులు తీశాడు. బాత్‌రూమ్‌లో పాము ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారంతా తీవ్ర భయాందోళనకు గురై వెంటనే స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ చేశారు. ఆయన వచ్చి ఎంతో చాకచక్యంగా బాత్‌రూమ్‌లో ఉన్న పామును బయటకు తెచ్చి పట్టుకున్నారు. సుమారు ఆరడుగుల ఈ నాగుపామును సురక్షిత ప్రాంతంలో విడిచిపెడతానని నాగరాజు తెలిపారు.

బాణసంచా కేంద్రంపై పోలీసుల దాడి

రూ.20 వేల విలువైన సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాణసంచా తయారీ సామగ్రి

పెందుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా గుట్టుగా నిర్వహిస్తున్న బాణసంచా తయారీ కేంద్రంపై పెందుర్తి పోలీసులు ఆకస్మిక దాడి చేసి రూ.20 వేల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ పరివాహక ప్రాంతం కంపరపాలెంలో తన ఇంటి సమీపంలోని స్థలాన్ని స్థావరంగా ఏర్పాటు చేసుకుని రవికుమార్ (43) అనే వ్యక్తి వారం రోజులుగా బాణసంచా కేంద్రాన్ని నడుపుతున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి పేలుడు పదార్థాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో రవికుమార్ గత ఏడాది అక్రమంగా బాణసంచా తయారీ కేసులో అరెస్టయి బెయిల్ వచ్చి, కొంతకాలం కారు డ్రైవర్‌గా పనిచేశాడని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

'లహరి కృష్ణ బోధనలు అనుసరణీయం'

పెందుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): లహరి కృష్ణ బోధనలు అనుసరణీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ఒకే దేవుడు-ఒకే దేశం నినాదంతో శ్రీమన్నారాయణ, శ్రీలహరికృష్ణ ఆధ్యాత్మిక మనుజ్యోతి బృందం ఆధ్వర్యంలో ప్రశాంతినగర్‌లోని పోర్టు కల్యాణ మండపంలో ఆదివారం శ్రీలహరి కృష్ణ ఉపదేశాలతో కూడిన దేశ అమృత మంజిరి ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ చేశారను. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గండి బాబ్జీ అమృత మంజిరి (అంకురం-2) ప్రేమ గల చేతుల నైపుణ్యం ఆధ్యాత్మిక గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆధ్యాత్మిక ఉద్యమానికి ఆద్యుడు లహరి కృష్ణ అని అన్నారు. నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ దేహమే దేవాలయం అన్న భావనను మానవాళిలోకి తీసుకువెళ్లిన లహరి కృష్ణ ఆధ్యాత్మిక సేవలు విశేషమైనవన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జి.సూర్యనారాయణ, జి.రవికుమార్, గౌరీశ్వరరావు, కృష్ణంరాజు, హరగోపాల్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు స్వాగతం పలుకుతున్న అంగముత్తు, తదితరులు

కేంద్ర మంత్రి సర్బానందకు ఘన స్వాగతం

గోపాలపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం నగరంలో జరిగే షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గ్యాస్ ట్యాంకర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను ఆయన ఆదివారం ఇక్కడకు చేరుకున్నారు. కేంద్ర మంత్రికి విశాఖ పోర్టు ఇన్‌చార్జి చైర్మన్ అంగముత్తు, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

క్షతగాత్రుడిని పరామర్శించిన ఎమ్మెల్యే గణబాబు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యుదాఘాత క్షతగాత్రుడిని చూస్తున్న గణబాబు

ఆర్పీపేట (కంచరపాలెం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ నాడు కంచరపాలెం మెట్టు వద్ద ఈదురుగాలులకు విద్యుత్ తీగ తెగి మీద పడడంతో గవర కంచరపాలెం ప్రాంతానికి చెందిన మామిడి శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఇండస్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఇండస్ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసరావును పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందేలా చూస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, ధర్మేంద్ర ఉన్నారు. కాగా ఇదే ఘటనలో గాంధీనగర్ ప్రాంతానికి చెందిన టీ దుకాణదారుడు ఈశ్వరరావు మృతి చెందిన విషయం తెలిసిందే.

పంప్ హౌస్ స్థల ఆక్రమణపై చర్యలు చేపట్టరూ..

పెందుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పంప్ హౌస్ స్థలాన్ని ఆక్రమించి సొంత అవసరాలకు వినియోగించుకున్న ఆక్రమణదారుడిపై తగిన చర్యలు చేపట్టాలని 96వ వార్డు పరిధి మర్రిచెట్ల కాలనీ ప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు, స్థానిక పాఠశాల సమీపంలో గల పంప్ హౌస్ స్థలం షెడ్డు శిలాఫలకాన్ని తొలిగించి కొందరు సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగ అధికారులు దృష్టిసారించి స్థల ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కొత్తపాలెం గ్రామంలో ప్రతిష్టించిన మండపంలోనే 25 అడుగుల దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

గోపాలపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ మండపాల్లోని ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కాగా ఇక్కడి కొత్తపాలెం గ్రామంలో ఫైవ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన 25 అడుగుల దుర్గాదేవి ప్రతిమను శనివారం రాత్రి ఉత్సవ మండపంలోనే నిమజ్జనం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నిమజ్జనాన్ని తిలకించారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్



జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని, పలు రకాల వస్తువులపై ధరలు తగ్గాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి కణితిలో ఆదివారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా పలు కాలనీలకు వెళ్లి జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. గృహ వినియోగ విద్యుత్‌పై ట్రూడౌన్ చార్జీలను యూనిట్‌కు 13 పైసలు తగ్గినట్టు పేర్కొన్నారు. నూతన జీఎస్టీ విధానంతో ప్రజలందరికీ ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు డీవీ అప్పారావు, దానయ్య, శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో 'సోలార్ పవర్ ఫుల్ ఎందుకీ నిర్లక్ష్యం' అన్న శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ గత ఏడాది కేంద్ర ప్రభుత్వం దేశంలో కోటి మంది వినియోగదారల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు ప్రధాన మంతి సూర్యఘర్ ముఫ్త్‌బిజిలీ యోజనను ప్రారంభించిందని తెలిపారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో విస్తృతంగా సమావేశాలు నిర్వహించడం, కరపత్రాలు పంపిణీ, గోడపత్రికలు, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీలు, సంస్థ ఉద్యోగులతో ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రూ. 2.5 లక్షల బ్యాంక్ గ్యారంటీ సమర్పించి, అయిదేళ్ల పాటు సర్వీస్ అందిస్తామని, గ్యారంటీ ఇచ్చిన వారిని వెండర్లుగా పేరు నమోదు చేసుకోవడానికి ఈపీడీసీఎల్ అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. వెండర్‌గా పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు నేరుగా ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సోలార్ పవర్ జనరల్ మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు.పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్ టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ చేసేందుకు 450 మంది కొత్త వెండర్స్‌కు అనుమతి మంజూరు చేశామని వివరించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూనర్ బిజినెస్ డెవలప్‌మెంట్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా వీరికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ పథకం 2027 మార్చి 31 వరకు మాత్రమే ఉంటుందని చెప్పారు. పథకం గురించి తెలుసుకోవాలన్నా, సోలార్ ఇన్‌స్టాలేషన్ చేసుకున్నవారికి ఏమైనా సమస్యలున్నా ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సోలార్ పవర్ చీఫ్ జనరల్ మేనేజర్ 9441155166, జనరల్ మేనేజర్ 9440812376, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 7382585446 నంబర్లను సంప్రతించాలని తెలిపారు.

నడక మైదానంలో స్వచ్ఛ భారత్

అగనంపూడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రి రహదారిలో గల నడక మైదానంలో స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ప్రతినిధి బలిరెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సభ్యులంతా నడక మైదానంలోని ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మడగల నరసింగరావు, కేవీవీ నాయుడు, బి.సత్యనారాయణ, చిన్ని పూర్ణ, రమణ, గంధం బాబూరావు, శంకరరావు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులతో నిలిచిన రాకపోకలు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తప్పని ఇక్కట్లు



మేహాద్రిగెడ్డకు వెళ్లే మార్గంలో రోడ్డుకు అడ్డంగా నిలిపిన ఎక్స్‌కవేటర్లు

వేపగుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట నుంచి మేహాద్రి గెడ్డకు వెళ్లే మార్గంలో ఎన్.సి.సి. పైపులైన్ పనుల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు నాయుడుతోట రవినగర్ మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి వెంకటసాయినగర్ శివాలయం ముందు పైపులైన్ అనుసంధాన పనులు జరగటంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఇక్కడ పనులు జరుగుతున్నట్లు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అక్కడకు వెళ్లి, మళ్లీ వాహనదారులు వెనుదిరగాల్సి వస్తోంది. అందువల్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేసి పనులు త్వరగా ముగించాలని స్థానికులు కోరుతున్నారు.